# ఎప్పటికెయ్యది ప్రస్తుత...

■డి. కామేశ్వరి

పక్క గదిలో ఆడవాళ్ళంతా కలిసి రేపటి రోజు కార్యక్రమం గురించి చర్చించడం వింది రాజ్యలక్ష్మి. వినకపోవడానికి ఆవిడకేమీ చెముడూ లేదు, వాళ్ళేమీ నెమ్మదిగానూ మాట్లాడడం లేదు. "మనం అంతా కలిసి పదముగ్గురం ఉన్నాం. బెంగాల్ కాటన్ చీరలు కొనేస్తే సరి. రాజ్యం ఎక్కువగా అవే కడ్తుంది కదా." రాజ్యలక్ష్మి అక్కగారు సర్వలక్ష్మి అంది. అంటూనే చెల్లెలు వరలక్ష్మి ఇంటి దగ్గర ఒకావిడ బెంగాల్ కాటన్ చీరలమ్ముతుంది గనక వరలక్ష్మిని వెళ్ళి మొత్తం చీరలు తెచ్చేయమని పురమాయించింది ఆవిడ. వింటున్న రాజ్యలక్ష్మి మంచంమీద నుంచి లేచి గుమ్మం దగ్గరకెళ్ళి, "అక్కయ్యా" అంటూ పిలిచింది.

"ఆఁ, ఏమిటే రాజ్యం" అంటూ ఆవిడ లోపలికి వచ్చింది. "ఏమిటి మీరంతా కలిసి ఏదో చీరలంటున్నారు." ఆరా తీసింది. సర్వలక్ష్మి మొఖం కాస్త విచారంగా పెట్టి, "ఏముంది. రేపు జరగాల్సిన కార్యక్రమం గురించి" అంది కాస్త గొంతు తగ్గించి.

"ఏమిటా జరగాల్సిన కార్యక్రమం?" రాజ్యలక్ష్మి రెట్టించి అడిగింది. ఆవిడ కాస్త ఇబ్బందిగా చూసి, "అదేనే, రేపు పదోరోజు గదా. ఆ తంతు ఉంది గదా. రేపు ధర్మోదకాలిచ్చాక నీకు చీరలివ్వాలి. అందుకే వరలక్ష్మిని చీరలు తెమ్మంటున్నాను" అంది సర్వలక్ష్మి.

రాజ్యలక్ష్మి అక్కగారి వంక సూటిగా చూసి, "చీరలేం తేనక్కరలేదు. నేను పుచ్చుకోను. అనవసరంగా మీరంతా ఈ తంతులేం పెట్టుకోవద్దు." నిష్కర్షగా అంది.

"అదేమిటే, ఏదో శాస్త్రం ప్రకారం అన్నీ చెయ్యాల్సిందే గదా. తప్పవు గదా." సర్ది చెప్పబోయిందావిడ.

"చాల్లే ఊరుకో అక్కయ్యా. మనం తప్పిస్తే మహారాజులా తప్పుతాయి. పదోరోజు ఇలా చెయ్యాలని ఎక్కడన్నా రాసివుందా? అవన్నీ నేను చేయను, చేయించుకోను. మీరు ఊరికే డబ్బు ఖర్చుపెట్టి చీరలవీ కొనకండి. నేను పుచ్చుకోను." కచ్చితంగా అంది.

వీళ్ళ మాటలు విని మిగతా ఇద్దరు చెల్లెళ్ళు, ఆడపడుచులు వచ్చారు లోపలికి.

"చీరలు వద్దంటోంది రాజ్యం. పుచ్చుకోదుట." అందరి వంకా చూస్తూ అంది ఆవిడ. అంతా మొహాలు చూసుకున్నారు.

పెద్దాడబడుచు కాస్త ఆశ్చర్యంగా చూసి, "అదేమిటి? వద్దంటే ఎలా? ఉత్తి చేతులతో లోపలికి వెళ్ళకూడదు" అందావిడ.

"లోపలికొచ్చి ఎవరు ఏం చూడాలి? రోజూ చూసే మొహమేగా నాది. కొత్తగా ఏం చూస్తారు మీరంతా?"

"అదేమిటమ్మా వదినా అలా మాట్లాడుతావు. రోజూ చూసే మొహం, రేపటి మొహం ఒకటెలా అవుతుంది. ఇన్నాళ్ళూ సుమంగళి మొహం. రేపు మొహం వేరు." బొట్టులేని విధవ మొహం అనలేక ఊరుకుంది.

"రేపు నా మొహం ఏం మారబోదు. ఇలాగే ఉంటుంది. నేను బొట్టూ అదీ ఏం తియ్యదలుచుకోలేదు. నా మొహం చూస్తే అమంగళం అని మీరంతా అనుకుంటే నేను గదిలోంచి బయటికి రాను. మీరు ఎవరూ లోపలికి రావద్దు." ఆవిడ నిష్కర్షగా అంది.

"బొట్టూ, గాజులూ అవీ ఎవరు తీస్తున్నారక్కయ్యా. ఈరోజుల్లో అందరూ పెట్టుకుంటున్నారు. ఏదో శాస్త్రం ప్రకారం రేపొక్కరోజు అయిపోనీ, తరువాత ఎవరు పట్టించుకుంటారు." డాక్టరు చెల్లెలు జయలక్ష్మి అంది.

"జయా, నీవూ... ఓ డాక్టరువైవుండి, నీవూ ఇలా మాట్లాడుతున్నావా? ఒకసారి చెరుపుకోవడం ఎందుకు, మళ్ళీ అంతా వెళ్ళాక పెట్టుకోవడం ఎందుకు? ఏమిటిదంతా? మనకంటే ఉత్తరాదివారి పద్ధతే కాస్త నయం. అలా శవం వెళ్ళగానే స్నానం చేయించి, బొట్టూ అదీ తీసి తెల్లచీర కట్టేస్తారు. మనం ఆ పదిరోజులూ బొట్టు పెట్టనిచ్చి, పదోరోజు పెళ్ళికూతురిలా అలంకరించి, ముత్తయిదువులంతా వచ్చి చూసిన తరువాత బొట్టు చెరపడం, గాజులు బద్దలు కొట్టడం... ఛీ ఛీ, ఎంత అనాగరికం, ఎంత శాడిస్ట్ మెంటాలిటీ అనిపిస్తుంది నాకు. ఇప్పుడీ పద్ధతి కాస్త మారింది కానీ, ఇంకా ఈ తంతులన్నీ కూడా జరపడం మనం అందరం మానాలి."

ఈ మాటలన్న రాజ్యలక్ష్మి చిన్నతనాన మొగుడు పోయి, విధవరాలయిన ఆవిడ కాదు. డెబ్బై మొన్ననే నిండింది ఆవిడకి. నిండు ముత్తయిదువుగా కళకళలాడే ఆవిడ మొహం చూసి, ఆవిడ పచ్చటి రంగు, ఆ ముఖంలో వర్చస్సు, కళాకాంతులు చూసి అంతా ఈవిడ ఈ వయసులోనే ఇంతందంగా ఉంది, చిన్నప్పుడు ఎంత బాగుండేదో అనుకోకమానలేరు.

'అమ్మ, ఫీచర్సు, ఆ రంగూ అదీ మనకి రానేలేదు' అనుకుంటారు ఆవిడ కూతుర్లు. రాజ్యలక్ష్మి పాత తరానికి చెందినదైనా ఆవిడ యాభై ఏళ్ళక్రితమే డిగ్రీ పాసయింది మద్రాసులో. ఆవిడ మాట్లాడినట్టు ఇంగ్లీషు అంత చక్కని ఉచ్చారణతో మాట్లాడేవారే లేరు ఈరోజుల్లో. మద్రాసులో అప్పటి కాన్వెంటులో చదివినవారికి చక్కని ఇంగ్లీషు గలగలా మాట్లాడడం వచ్చేది. ఆవిడ తండ్రి మద్రాసులో మంచి లాయరుగా ఉండి, గాంధేయవాదిగా, సంఘ సంస్కర్తగా తెలుగువారిలోనే కాక, తమిళుల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి. ఆయన ఆ కాలంలోనే తన నలుగురు కూతుళ్ళని కొడుకులతో సమానంగా కాలేజీకి పంపి చదివించారు. రాజ్యలక్ష్మి బి.ఏ పాసయ్యాక పెళ్ళి నారాయణరావుగారితో జరిగింది. ఆయన లాయరు. పెళ్ళయ్యాక అత్తవారింట్లో ఆడపిల్లలకి పెద్ద చదువులు చెప్పించే శ్రద్ధ లేకపోయినా ఆవిడ భర్తని ఒప్పించి, ఓ విధంగా బలవంతంగానే ఎమ్మే పరీక్ష ప్రైవేట్‌గా రాసి పాసయింది. ఆవిడ అక్క సర్వలక్ష్మి బి.ఏ చదివింది. చెల్లెలు వరలక్ష్మి బ్యాంక్ మేనేజరు. ఆఖరి చెల్లెలు జయలక్ష్మి డాక్టరు. ఆ ఇంటి కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు ఆ రోజుల్లోనే మంచి చదువులు చదివి ఉద్యోగాలు చేసిన ఇల్లు ఆమె పుట్టిల్లు. రాజ్యలక్ష్మి పెళ్ళయి వరుసగా పిల్లలు పుట్టుకురావడంతో సంసార బాధ్యతల్లో పదిహేనేళ్ళు గడిచిపోయి, పిల్లలు పెద్దవాళ్ళయ్యాక, వేరింటి కాపురం వచ్చాక ఆవిడ ఓ ప్రైవేట్ స్కూలులో చేరి ఆ స్కూలుకి హెడ్ మిస్ట్రెస్‌గా చేసి, తరువాత ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా చేరి రిటైరయిన ఆవిడ. ఎంత చదివినా, ఎన్ని ఉద్యోగాలు చేసినా ఆవిడ సంసార బరువు బాధ్యతలు, సంప్రదాయాలు, జరపాల్సిన ఆచారాలు, ముద్దు ముచ్చట్లు అయిదుగురు పిల్లలకీ జరిపించింది. భర్త నారాయణరావు హైకోర్టు లాయరుగా ప్రాక్టీసు చేసి డబ్బు ఆర్జించడం తప్ప ఇల్లు, భార్య, పిల్లలు, పెద్దగా ఏ విషయమూ ఏనాడూ ఆయన పట్టించుకోలేదు. ఆవిడకి భర్తతో పెద్ద చనువు, అనురాగం, అనుబంధం, ఇద్దరి మధ్య పెద్దగా సామరస్యం ఏమీ లేకుండానే అయిదుగురు పిల్లలని కని సంసారం చేసింది. ఆ రోజుల్లో మగాడు ఇంటి విషయాలు పట్టించుకోకపోవడం మామూలు విషయమే గనుక ఆవిడ బాధపడనూ లేదు, ఆవిడ చదువుకుని ఉద్యోగం చేసినా ఆయన భార్యని పెద్దగా గౌరవించిందీ లేదు. అలా అని తీసిపారేసిందీ లేదు. అంటీముట్టనట్లుండేవారు. తన కోర్టు కేసులు, క్లయింట్లు తప్ప ఇంటి వ్యవహారాలు ఆయనకి పట్టకపోవడంతో ఇంటి సంగతులు ఆవిడ దక్షతగా చూసుకుంది.

రాజ్యలక్ష్మికి స్వతంత్ర అభిప్రాయాలున్నాయి. అక్కగారి భర్త పోయినప్పుడు పదోరోజు తంతు చూసి అప్పుడే నిర్ణయించుకుంది. తాను చదువుకొనీ ఇంకా గుడ్డిగా అర్థం లేని కొన్ని ఆచారాలు పాటించే అవసరం లేదన్నది ఆవిడ నమ్మకం.

అందుచేత నారాయణరావుగారి మృతికి ఆమెకు పెద్దగా దుఃఖించాల్సింది ఏమీ కనపడలేదు. డెబ్భై తొమ్మిదేళ్ళు బతికి, రోగం రొస్టు లేకుండా గుండె నొప్పితో నిమిషాల మీద దాటిపోయిన ఆయన అదృష్టవంతుడనే అనుకుంది. రావలసిన వారంతా వచ్చారు. కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు- ఇటూ అటూ రావలసిన బలగమంతా వచ్చారు. అమెరికా నుంచి వచ్చిన పెద్ద కొడుకు, ఢిల్లీ నుంచి వచ్చిన రెండో కొడుకు తండ్రికి అంత్యక్రియలు యథావిధిగా జరిపి, భక్తిశ్రద్ధలతో పదో రోజు కర్మకాండ ఆరంభించారు.

ముందునించి రాజ్యలక్ష్మికి స్వతంత్ర అభిప్రాయాలున్నాయి. ఆవిడ జీవితంలో ఆవిడ అనుకున్నవన్నీ కొన్ని జరగకపోయినా, కొన్ని విషయాలలో సర్దుబాట్లు తప్పకపోయినా, ఈ విషయంలో మాత్రం ఆవిడ ఎవరి మాటా వినదలచుకోలేదు. ఏణ్ణర్థం క్రితం అక్కగారి భర్త పోయినప్పుడు



చిత్రాలు: నర్సిం

పదోరోజు తంతు చూసి ఆనాడే నిర్ణయించుకుంది. అక్కగారి అత్తవారివైపు అంతా పల్లెటూరి రకం. ఇంకా చాదస్తంగానే ఆలోచిస్తారు. తాము చదువుకునీ ఇంకా గుడ్డిగా అర్థం లేని కొన్ని ఆచారాలు పాటించనవసరం లేదన్నది ఆవిడ నమ్మకం.

"అదేమిటమ్మా వదినా అలా అంటావు. మనం ఎంత చదువుకున్నా, ఎంత ఆధునికులం అనుకున్నా ఏదీ మానేశాం. ఉపనయనాలు మానామా, పెళ్ళిళ్ళు మానామా, కర్మకాండలు మానామా, పూజలు, నోములు మానామా. అన్నీ శాస్త్రోక్తంగా చేస్తూనే ఉన్నాంగా. ఇదీ శాస్త్రప్రకారం జరగనీ. ఏం, అమెరికాలో ఉన్న నీ కొడుకు గుండు చేయించుకుని తండ్రికి కర్మ చేయడంలేదూ, ఇదీ అంతే. నిన్నెవరు గుండు చేయించుకొని తెల్లచీర కట్టుకోమంటున్నారూ. అందరూ వెళ్ళే దారిన మనమూ వెళ్ళాలి." సాగదీస్తూ అంది. రెండో ఆడపడుచు కాస్త ఘటికురాలు. మాట పెళుసు. ఏదనాలన్నా వెరపు లేకుండా అనే తత్వం ఆవిడది.

"చూడు పద్మా, కర్మకాండలు వేరు. మనిషి చచ్చిపోయాక అతని ఆత్మ కొన్ని రోజులు అలా గాలిలో తిరుగుతుంటుందని, కర్మకాండలు జరిగితేగానీ అవి తృప్తి పడవనీ ఏవో పురాణాల్లో చెప్పారు. అది ఎంతవరకు నిజమో తెలియదు కానీ, పిల్లలు తమ తల్లితండ్రుల పట్ల తమ కృతజ్ఞతను, కర్తవ్యాన్నీ ఆ విధంగా నిర్వహించి, వారి రుణం తీర్చుకోవడం తమ ధర్మంగా భావించి చనిపోయినవారి పేరిట దాన ధర్మాలు నిర్వర్తిస్తారు. దానికి, దీనికి ఏం సంబంధం లేదు. నాకు వచ్చిన మంగళసూత్రం, నల్లపూసలు, మట్టెలు అవి భర్త పోయాక ఆ గుర్తులు తీసేస్తే చాలని నా ఉద్దేశం." ఆవిడ కాస్త ధాటిగానే జవాబిచ్చింది.

"మన పెద్దవాళ్ళు ఊరికే ఈ ఆచారాలు పెట్టారంటావా?"

"మన ఆచారాలు కాలానుగుణంగా మార్చుకోవాలి. ఆ రోజుల్లో బాల్య వివాహాలు జరిగేవి. యౌవనంలో ఉండగానే చాలా మంది వితంతువులయ్యేవారు. భర్త పోయాక ఒంటరి అయిన స్త్రీని ఏ పురుషుడూ వాంఛించకుండా గుండు గీయించి, తెల్లచీర కట్టించి వికారంగా చేసి కూర్చోబెట్టేవారు. వితంతువులు కోరికలకు బానిసలవుతే దానివల్ల భ్రూణ హత్యలు, అక్రమ సంతానాలు, అనాథ శిశువులు పెరుగుతారని ఆ విధంగా కట్టుబాట్లు ఏర్పరచి ఉండొచ్చు. అప్పటి స్త్రీ చదుకోని అజ్ఞానురాలు. తనకి తాను స్వతంత్రంగా ఆలోచించలేని, స్వతంత్రంగా బతకలేని పరాధీన. మనం ఇన్నాళ్ళ తరువాత కూడా ఇంత చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ ఇంకా మంచి చెడులు తెలుసుకోలేని స్థితిలో లేంగదా! మనం సాధించిన ప్రగతి, పురోభివృద్ధి మరేం లేదా. ఇంకా ఇంకా పాతాచారాలే పట్టుకు వేళ్ళాడాలా?" తీవ్రంగా అంది.

గదిలో ఆడవాళ్ళ మాటలు విని మగవాళ్ళు గదిలోకి వచ్చారు. చిన్నాడబడుచు ఓడిపోవడం ఇష్టం లేనిదానిలా, "ఏమో తల్లీ, పెద్దవాళ్ళు ఓ ఆచారం పెట్టారంటే ఏదో ఆలోచించే పెట్టి ఉంటారు."

"అవును నిజమే. ఈ ఆచారం ఆనాటికి తగ్గట్టుగానే ఆలోచించి పెట్టారు. ఈ పదోరోజు వితంతువుని చేసి చీరలివ్వడం ఎందుకు పెట్టారో చెప్పనా. ఆ రోజుల్లో ఆడదానికి సంపాదన లేదు. భర్త పోతే ఆమె అత్తింట్లోనో, పుట్టింట్లోనో అందరికీ చాకిరీ చేస్తూ పడుండే గతి ఉండేది. భర్త పోయిన స్త్రీ ఓ చీర కొనాలన్నా నోరు తెరిచి ఎవరినీ అడగలేని దుఃస్థితి ఆనాటి స్త్రీది. ఇలా పదో రోజు ఆమె మొహం చూసే ముందు ఉత్త చేతులతో వెళ్ళకూడదనడంలో అర్థం, వచ్చినవాళ్ళంతా తలో తెల్లచీర ఇస్తే కనీసం మూడు నాలుగేళ్ళన్నా ఆమెకి చీరల బాధ ఉండదు అని ఏర్పాటు చేసి ఉంటారు."

"మంచి లా పాయింటు తీశావే" అంది అక్కగారు నవ్వి. "నీవంటే ఆ మాట నిజమే అనిపిస్తోంది."

"అవునక్కయ్యా! వితంతు మొహం చూడడానికి చీరెందుకు పెట్టడం. అవి ఆమెకి ఉపయోగించాలన్న ఆలోచన అది. ఈనాటి ఆడదానికి ఆ ఆచారం అవసరం లేదు. అంతేకాదు, ఇంకో స్టుపిడ్ ఆచారం, భర్త పోయిన స్త్రీని ముత్తయిదువ చూడడానికి వెళ్ళే ముందు నోట్లో జీలకర్ర వేసుకొని వెళ్ళాలట. నోట్లో జీలకర్ర వేసుకున్నంతమాత్రాన ముత్తయిదువతనానికి భంగం రాదంటే లోకంలో ఏ స్త్రీ వితంతువవకూడదు మరి. ఈ ఆచారానికి అర్థం తెలిస్తే చెప్పండెవరన్నా." రాజ్యలక్ష్మి అందరి వంకా చూస్తూ అడిగింది.

"అమ్మ చెప్పింది నిజమే. ఈ ఆచారాలన్నీ కాలానుగుణంగా మారాలి గాని, ముత్తాతలనాడు చేశారు, మనమూ చెయ్యాలనడం అవివేకం." అమెరికాలో ఉండే పెద్ద కొడుకు అన్నాడు.

"అమ్మకింత వయసు వచ్చాక ఇంక వైధవ్యం ఏమిటసలు? ఎనభై ఏళ్ళ నాన్నగారు పోవడం వింతేముంది! ఈ వయసులో ఆవిడకిష్టం లేని పనులు చేసి మనం బాధపెట్టకూడదు." పెద్ద కూతురు అంది.

"సరేనమ్రా! మీరంతా ఎలా అంటే అలాగే. దాని మనసు కష్టపెట్టద్దు." అక్కగారు అంది.

"ఓసారి పురోహితుణ్ణి అడగండి కాస్త. లేదంటే రేపేం అనర్థం జరిగినా అంతా మనల్ని అంటారు." పెద్దాడబిడ్డ సాగదీసింది.

"ఆయనేం అంటాడు. 'శాస్త్రం ఇదీ అమ్మా' అంటాడు. చేసేది, మానేది మనిష్టం." కొడుకు అన్నాడు. రెండో ఆడపడుచు తన అన్నగారి ఆత్మకి అన్యాయం జరిగిపోతున్నట్టు బాధపడిపోయింది. అంతా ఒకటయ్యాక ఇంక ఏం అనాలో అర్థం కాక వదినగారి వంక కాస్త హేళనగా చూసి, "అయితే వదినా, కర్మ చేస్తున్నవాళ్ళు గుండెందుకు చేయించుకోవాలో. లా పాయింటు తెలిస్తే చెప్పు" అంది వ్యంగ్యంగా. రాజ్యలక్ష్మి సూటిగా చూసి, "చెప్పమంటావా- కర్మ



చేసేవాళ్ళు ఆ పదమూడు రోజులూ చెరువుల్లో, కాలవల్లో స్నానాలు చేసేవారు. జుత్తుంటే రోజూ అడ్డమైన నీళ్ళలో స్నానాలు చేస్తే, జుత్తు ఎండక, జలుబులు, దగ్గులు, రోగాలు రాకుండా ఆ ఆచారం పెట్టి ఉంటారు. సైంటిఫిక్‌గా ఆలోచించడం ఆనాడూ వచ్చినా కారణాలు సరిగా చెప్పలేక 'ఆచారం' అని రూలు పెట్టి పాటించమనేవారు."

"అబ్బో! అక్కయ్య ఈ సబ్జక్ట్ మీద చాలానే రిసర్చి చేసినట్టుంది." వరలక్ష్మి నవ్వుతూ అంది.

"ఇంత తెల్సినవాళ్ళు, ఈ కర్మకాండలు, ఈ తంతులు అన్నీ ఎందుకు? మానేయాల్సింది." మూతి తిప్పి అంది ఆడబడుచు.

"చిన్నత్తా! కర్మకాండలు చేస్తే ఆత్మలు శాంతి స్తాయి అన్న వాదనలో ఎంత నిజం ఉందో నాకు తెలియదు కానీ, కన్న తండ్రి పోతే ఆయన పట్ల కృతజ్ఞతతో, పిల్లలుగా ఆయన పేరిట దానధర్మాలు చేసి రుణం తీర్చుకోవడం పిల్లల బాధ్యత అని నేను నమ్మాను. కనుక చేస్తున్నాను. అంతే కాదు, మనం చేసిన మంచి, చెడ్డ పనుల చేతే జన్మలు, పునర్జన్మలు ఉంటాయన్న నమ్మకం ఉంది. ఉత్తప్పుడు మనం ఎవరికైనా ఏదన్నా పెట్టాలంటే చేతులు రావు. ఇలా ఆచారాలు ఏర్పరిస్తే చెయ్యకపోతే తప్పన్న భావనతోనైనా ఆ పది రోజులు నలుగురు బీద బ్రాహ్మణులకు భోజనాలు, దానాలు ఇస్తున్నాం. ఇది మంచి పనేగా! తత్ దినం అంటే తద్దినం పోయిన మనిషిని ఏడాదికోసారి గుర్తుచేసుకోవడానికే ఏర్పరిచారు గదా! ఇది మనమే కాదు, అన్ని దేశాల ప్రజలు చర్చిలకెళ్ళి ప్రార్థనలు చేసి, సమాధులు దర్శించి గుర్తుచేసుకోవడం చేస్తారుగా! మనం ఈ విధంగా ఈ పదమూడు రోజులు చేస్తున్నాం."

"అబ్బో! అమెరికా వెళ్ళినా మా మేనల్లుడు మన ఆచారవ్యవహారాలు బాగానే గుర్తుపెట్టుకున్నాడు.

"నిజం చెప్పనా చిన్నత్తా! అమెరికా వెళ్ళాకే మన ఆచారవ్యవహారాలు, సాంప్రదాయాల పట్ల అవగాహన, ఆలోచన మొదలైందనాలి. మన భారతీయ పురాణాలపైన, ఇతిహాసాలపైన, వేదాలపైన, మన భారత సంస్కృతి గురించి మన కంటే ఎక్కువగా విదేశాల వారు తెల్సుకుంటుంటే, మనం మన సంస్కృతిని చిన్న చూపు చూస్తూ, విదేశీ సంస్కృతి మోజులో పడ్తున్నాం అన్నది అర్థమైంది."

"ఏమో నాయనా! మీ ఇష్టం. మా అన్నయ్యతోనే పోయింది మా మాట విలువ." మొహం మాడ్చుకుని వెళ్ళింది చిన్నాడబడుచు, ఆ వెంట పెద్దావిడ.

*　　*　　*

రెండేళ్ళ తరువాత.

"అమ్మా! అందరూ చీరలు పట్టుకుని వచ్చారు.

భర్త పోయిన పదిహేనో రోజున చక్కగా పెద్ద బొట్టు, పెద్దంచు జరీ చీర, చేతుల్కి బంగారు గాజులు, మెడలో రెండు పేటల చంద్రహారం, పగడాల గొలుసు... పద్మకి వైధవ్యం వచ్చిందంటే తెలియని వారెవరూ నమ్మలేరు.

మనం తీసుకు రాకపోతే చిన్నత్త ఏమనుకుంటుందో!" తల్లితో గుసుగుసలాడింది సరళ. ఆ రోజు చిన్నాడబిడ్డ పద్మ భర్త పోయి పదో రోజు. ఆయనకి అరవై ఎనిమిదేళ్ళు అయినా, హఠాత్తుగా గుండె పోటుతో పోయాడు. ఊర్లోనే ఉన్న ఆడబడుచుకి ఈ పది రోజుల నుంచి అవసరంలో ఆదుకుంది రాజ్యలక్ష్మి. సరళ ఊర్లోనే ఉంటుంది గనక పదో రోజు ధర్మోదకాలకి కూతుర్ని వెంటబెట్టుకు వచ్చింది ఆవిడ.

"అనుకోడానికి ఏముంది? నేను ఇదివరకే ఇవన్నీ నాకిష్టం లేవని స్పష్టంగా చెప్పాను గదా!"

"అది నీ విషయం అమ్మా! ఇప్పుడు పుట్టింటి చీరన్నా తేలేదు ఎవరూ. మా అమ్మానాన్నలతో సగం పోయింది పుట్టిల్లు. అన్నయ్య పోయాక ఇంక మాకు పుట్టింటి ఆశ ఏం మిగలలేదు అంటూ దెప్పుతుందేమో!" సరళ అంది.

"అవన్నీ మనం పట్టించుకోవద్దు." ముభావంగా అంది రాజ్యలక్ష్మి.

ధర్మోదకాలు, స్నానాలు అయి కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, ఆవిడ అక్కాచెల్లెళ్ళు, ఆడపడుచులు- అంతా చీరలు పట్టుకు గదిలోకి వెళ్ళి వచ్చారు. "అదేమిటమ్మా వదినా అలా కూర్చున్నావు! లోపలికి వెళ్ళి చూసిరా" అంది పెద్దాడపడుచు. ఆవిడ దృష్టి ఇటు అటు సారించింది, రాజ్యలక్ష్మి దగ్గర చీర కనబడక.

"ఏం చూడాలి? నా కిలాంటివి ఇష్టం లేదన్నాను కదమ్మా" అంది రాజ్యలక్ష్మి.

"అదేమిటి, ఇంకెవరిచ్చినా, మానినా పుట్టింటి చీర ఇచ్చేందుకు ఇంకెవరున్నారు దానికి? నీవలా అంటే కుదరదు. అది బాధపడ్తుంది. నీకు నమ్మకాలు లేకపోయినా, ఇంకొకరి కోసం, వాళ్ళకి నమ్మకాలున్నప్పుడు చెయ్యాలి." ఆవిడ కాస్త అథారిటీతోనే అంది.

"నీవు వెళ్ళకపోతే, సరళ చేతనయినా

పంపించు." వదినగారి పట్టుదల తెల్సి ఆ రూలు కాస్త సడలించిందావిడ.

"చీరేం తేలేదు అమ్మ." సరళ గొణిగింది.

"పోనీ తేకపోతే. తరువాత చూసుకోవచ్చు. ఎవరి దగ్గిరన్నా కొత్త చీర ఉంటే తీసికెళ్ళి ఇచ్చిరా వదినా. సరళ చేత ఇప్పించు. దానికసలే పట్టింపు జాస్తి. పుట్టింటి చీర రాలేదని బాధపడ్తుంది." పెద్దాడపడుచు వదలలేదు. రాజ్యలక్ష్మి అనిష్టంగా మొహం పెట్టింది. సరళ ఇబ్బందిగా చూసి, "ఇంటికెళ్ళి చీర తేనా అమ్మా" అంది. రాజ్యలక్ష్మి ఏదో అనే లోపలే లోపల్నించి పద్మ, "అక్కయ్యా ఇలా రా" అంటూ పిలిచి, "నా పుట్టిల్లు అమ్మానాన్నలతోనే పోయింది. అన్నయ్య పోంగానే పూర్తిగా పోయింది. ఆవిణ్ణి ఎందుకు దేబిరించడం? ఆచారవ్యవహారాలు పాటించడం ఆవిడకిష్టం లేదందిగా! నాకేం చీరలు లేవా? ఆవిడ చీర కోసం ఎవరేడిచారు? నా బతుకిలా అయిందని ఏడవాలి గాని" అంది గట్టిగానే.

రాజ్యలక్ష్మి లోపలికొచ్చి, "చూడమ్మా పద్మా! నీకో చీర పెడితే నా భాగ్యం తరిగిపోదు. ఈ చీరతో నీ రోజులు వెళ్ళిపోవు. మనలాంటివాళ్ళం ఎన్నాళ్ళయినా మారకుండా పాత ఆచారాలు పట్టుకు వేళ్ళాడ్డంలో అర్థం లేదన్నది నా ఉద్దేశం. అంతేగానీ, నీకు పుట్టింటి ఆచారాలు జరపడానికి ఎవరూ లేరని నీవనుకో నక్కర లేదు. సరే, నీకంత పట్టింపు ఉంటే నీవన్నట్టే కానీ." కూతురు చేతిలో చీర అందుకుని పద్మ పక్కన పెట్టి అవతలికి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

చుట్టాలంతా వెళ్ళారు. పిల్లలంతా ఆరోజు ప్రయాణం పెట్టుకుని, తల్లిని కొడుకు కొన్నాళ్ళుంచుకోవడానికి తీసికెడ్తున్నాడని, మూడు నాలుగు నెలల వరకు రాదని ఆడపడుచును చూడడానికి వెళ్ళింది రాజ్యలక్ష్మి, సరళను తీసుకుని. అంతా ప్రయాణం హడావిడిలో ఉన్నారు సామాన్లు సర్దుకుంటూ. వంట గదిలోంచి కాఫీ గ్లాసులతో వస్తున్న పద్మని ఆశ్చర్యంగా చూశారు రాజ్యలక్ష్మి, సరళ. భర్త పోయిన పదిహేనో రోజున చక్కగా పెద్ద బొట్టు, పెద్దంచు జరీ చీర, చేతుల్కి బంగారు గాజులు, మెడలో రెండు పేటల చంద్రహారం, పగడాల గొలుసు... ఆవిడకి వైధవ్యం వచ్చిందంటే తెలియని వారెవరూ నమ్మలేరు. రాజ్యలక్ష్మిని చూసి ఒక్క క్షణం తొట్రుపడి, "రా వదినా! పిల్లలంతా ప్రయాణం హడావిడిలో ఉన్నారు. కూర్చో" అంది కాస్త ఇబ్బందిగా. మేనత్తని చూసి ఏదో అనాలని నోరు తెరవబోయింది సరళ. అది గమనించిన రాజ్యలక్ష్మి కూతుర్ని కళ్ళతోనే వారించింది. అది పద్మ చూడనూ చూసింది.

"ఏమిటే అంత ఆశ్చర్యపోతున్నావు. బొట్టూ అదీ పెట్టుకున్నాననా. మీ అమ్మ దారితీసిందిగా ఇంట్లో. వదినగారు మా కంటే పెద్దది. ఆవిడ అడుగుజాడల్లో మేమూ నడవాలిగా." అదోలా నవ్వుతూ సమర్థించుకుంటూ అంది.

"మరి మొన్నెందుకు అన్ని కబుర్లు చెప్పావు, ఆచారాలు, సాంప్రదాయాలు పాటించాలంటూ. అమ్మని అందరూ ఆడిపోసుకున్నారు ఆరోజు. అంతేలే చిన్నత్తా. ఎవరి దాకా వస్తేగాని వాళ్ళకి అర్థం కాదు." నిష్ఠురంగానే అంది సరళ.

"బాగుంది. ఆ ఒక్క రోజు పెద్దవాళ్ళు చెప్పినట్టు ఎవరిచేతా అనిపించుకోకుండా మన ఆచారాలు పాటిస్తే గొడవుండదుగదా. ఎప్పుడు చెయ్యాల్సింది అప్పుడు చేసేస్తే ఆ తరువాత మనల్ని అనేది ఎవరు. ఈరోజుల్లో బొట్టూఅదీఅందరూ పెట్టుకుంటున్నారుగా!"

"అవునమ్మా పద్మా! 'ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటి' మీలాంటి గడుసువాళ్ళు చేస్తారు. నాలాంటి తెలివి తక్కువ వారు బయటపడి మాటలనిపించుకుంటారు." రాజ్యలక్ష్మి అదోలా నవ్వి అంది.

తల్లి నవ్వులో అర్థం తెలిసిన సరళ, 'ఊరికే వచ్చే ఓ పదిహేను ఐరవై చీరలు తెలివితక్కువగా వదులుకోవడం ఎందుకులే చిన్నత్తా' అని అంటించాలని అనిపించినా. తల్లికి భయపడి ఊరుకుంది. ■

# పల్లె చెప్పిన కథలు

## మట్టి మనుషుల జీవితాల్ని దోసిట పట్టిన ఇతివృత్తాలు



పండుటాకు
రచన: కాట్రగడ్డ దయానంద్
ప్రతులకు: రచయిత, డబ్ల్యు 1/519, జె.ఆర్. పేట, గూడూరు, నెల్లూరు జిల్లా-524 101; పేజీలు: 119; వెల: రూ. 25/-

■ పసునూరు శ్రీధర్‌బాబు

మట్టిని చీల్చుకు వచ్చి చిగురు తొడిగిన అక్షరాలివి. అందుకే తడి తడిగా, పచ్చగా, బతుకు వాసన వేస్తున్నాయి. నేల మీద కాళ్ళానుకుని పచ్చి గాయంలా తడుముతున్నాయి. ఇంత నిక్కచ్చిగా, కడుపు తరుక్కుపోయేలా, రగిలిపోయేలా మట్టి మనిషి గుండె చప్పుడును వినిపించిన కథలు మనకు చాలా అరుదుగా లభిస్తుంటాయి. వస్తువే శిల్పమై అల్లుకుపోవడం మంచి కథల లక్షణం. సాహిత్యకారుని జిజ్ఞాసకు, స్వీకరించే జీవితానికి సామరస్యం కుదిరినప్పుడు కథలు సలక్షణంగా గుబాళిస్తాయి. కాట్రగడ్డ దయానంద్ ఆ అరుదైన సామరస్యానికి చక్కని ఉదాహరణ.

*హఠాత్తుగా నిద్ర కుబుసం విడిచింది. ఎక్కడో దూరాన వాన కురిసి వెలిసినట్టుంది. మట్టి తడిసిన వాసన నామీది నుంచి దూకుడుగా కదిలిపోయింది. గాలి ఒక్కసారిగా విసురుగా వీచింది. మర్రి కొమ్మల్లోని పిట్టలు కలకలమైన కాసేపటికి చెట్టు మీద సర్దుకున్నాయి (చారెడు నేలా... గుప్పెడు గింజలూ!).* ఇలా ఒక వాతావరణాన్ని సృష్టిస్తూ తన కథలోకి తీసుకు వెళ్ళిపోతారు దయానంద్. ఆయన కథనం ఎక్కడా దారితప్పదు. మానవతా సంబంధాలనే చివరి వరకూ అంటి పెట్టుకుని, అదే దారి వెంట వెడుతుంటుంది.

చిన్నప్పుడే ఇంటి నుంచి పారిపోయి సైన్యంలో చేరిన వ్యక్తి చాలా కాలం తరువాత తాను పుట్టిన ఊరికి వస్తూ స్వగతంలో వినిపించిన కథ ఇది. సొంత ఊరికి సాగే ప్రయాణంలోనే ఆ సైనికుడు ఎన్నో మార్పులను గుర్తిస్తుంటాడు. తన స్వగ్రామం తాను చూసినప్పటికీ, ఇప్పటికీ ఎంతగానో మారిపోయి ఉండడం అతనికి వింతగానూ, ఆనందంగానూ తోస్తుంది. ఆయన కథలు మనసులను అడుగడుగునా తట్టి లేపుతుంటాయి.

కిరాణా బంకు సీమ కోమటాయన ఇల్లు స్థానంలో లంకంత మేడ కొలువుదీరి కనిపించడం అతనికి కనిపించిన పరిణామాల బాటలో మొదటి అడుగు. పొగాకుతో నష్టపోయి, పత్తి వేసి అప్పుల్లో కూరుకుపోయి తిండికి మొహం వాచిన రైతులు... ఇలా ఒక్కొక్క మార్పునే తన పాత్రకు పరిచయం చేస్తూ దయానంద్ కథ నడిపిన తీరు నేలను నమ్ముకున్న వాడి బతుకు గ్రామసీమల్లో విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంస్కృతిలో ఎలా దయనీయంగా పరిణమించిందో కళ్ళకు కట్టిస్తుంది.

"మునుపటి అందం లేదు. మునుపటి సందడి లేదు. అప్పుడు తెల్లారుతోందంటే హడావిడిగా ఉండేది. జొన్నలు తొక్కుతున్న రోకళ్ళు గోల చేసేవి. జీతగాళ్ళు పెద్ద పెద్దగా మాట్లాడుకుంటూ అరకలు కట్టుకుని పొలం దారి పట్టేవాళ్ళు. ఇప్పుడవేవీ కనిపించడం లేదు" అని వాపోతూ ఇంటికి చేరుకున్న ఆ సైనికుడు తల్లికి బంగారం చేయించుకోమని పాతిక వేలిస్తాడు. కానీ, పొలం తాకట్టు పెట్టుకుని సెట్టి దగ్గర గింజలు మోస్తున్న అతని తండ్రి ఆ డబ్బుతో పొలం విడిపించుకోవడానికే నిర్ణయిస్తాడు. మట్టి మీద నమ్మకం సడలని రైతు జీవితాన్ని, గ్రామ వ్యవస్థ నిరాదరణకు గురవుతున్న వైనాన్ని ఈ కథ గుండె కింద తడిలా పరచుకుంటుంది. చాన్నాళ్ళ తరువాత కళ్ళ ముందు కనిపించిన వ్యక్తిని చూసి ఊరు స్పందించిన తీరును కూడా రచయిత ఇందులో హృద్యంగా ఆవిష్కరిస్తారు. "నోరుముయ్యరా సోంబేరోడా! మీకేం తెల్సురా మా బాధలు? ఎలా ఉండేవాళ్ళం ఎలా అయిపోయేం! ఒకప్పుడు బుడబుక్కలోల్లూ, చెంచులోల్లూ, కాటికాపరులు మనూరిని నమ్ముకుని బతికిన రోజులున్నాయిరా! ఇవ్వాల తినడానికి ముద్దా, కట్టుకోవడానికి గుడ్డా లేని రోజులొచ్చేయి మనకు" అంటూ గ్రామంలో ఒకాయన చేసిన వ్యాఖ్య అక్కడి బతుకు లోతులకు అద్దంపట్టింది. "నన్నానుకుని నాన్న కూర్చున్నాడు... అమ్మ నాలో చిన్నప్పటి తన కొడుకును దేవులాడుకుంటోంది... వరసైన ఆడ పిల్లలు గోడల మీంచి, తలుపుల పక్క నుంచి తొంగి తొంగి చూసేరు." ఇలా పాత్రల మనసు లోతులను, నిరాడంబరంగా వ్యక్తీకరించడం దయానంద్ శైలి.

"బంగారం దేముందే పిచ్చిమొహమా! కాలం, కర్మం కలసి రావాలే కానీ ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు. ఈసారికి తాళిబొట్టు దారం చేయించుకో. మిగిలిన డబ్బుల్తో మన పొలం తాకట్టు ఇడిపించుకుందాం."
-పుట 44

*పండుటాకు* కథలో పేద జీవితంలోని మరో పార్శ్వం అద్భుతంగా ఆవిష్కృతమైంది. కష్టాల కడలిని ఈది జీవిత చరమాంకంలో ఉన్న ఒక వృద్ధురాలి మానసిక స్థితిని దయానంద్ చాలా సహజంగా వినిపిస్తారు. ఈ కథకు కొనసాగింపుగా రాసిన *శిశిరం* కథ పల్లె జీవితంతో కాస్తో కూస్తో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ వెంటాడుతుంది.

*మబ్బుతునకా..*, *మట్టి ముద్దా!*, *వసంత*, *కర్రావు*, *వెండి మొలతాడు*, *మర్రి నీడ* వంటి కథలన్నీ రచయిత పల్లె జీవితాన్ని, పేద జీవితాన్ని దోసిలితో పట్టి చూపిస్తున్నట్లే ఉన్నాయి. దయానంద్ కథలు చదువుతుంటే నిజమైన కథ పల్లెలోనే ఉండిపోయిందనిపిస్తుంది. నగరం మేలి ముసుగులు దానికసలు గిట్టవేమోననిపిస్తుంది. తాను కథ వెనుక ఉన్నాననే స్పృహ కల్పించకుండానే పాఠకుడితో కథలు చదివింపజేయగల నేర్పు సాధించినవాడే మంచి కథా రచయిత. ఈ కథల్లో ఆ స్పృహ ఎక్కడా మనల్ని వెంటాడదు. ■